
# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహాకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

## ఆ మాటొద్దులే!

'వస్తున్నాడు శంకర్!' గుసగుసగా అనుకున్నారు టాంకర్ దగ్గర నీళ్ళు పట్టుకుంటున్న ఆడవాళ్ళు.

మూడుపక్కలా గోడకట్టి, దానికి ఆనుకుని ఉండేలా రెండు, మూడు గదులుండేలా పధ్నాలుగు పోర్షన్లు ఉన్న కాంపౌండ్ అది. దానిలో ఉండేవారంతా సామాన్యమైన ఆదాయం కలవారే. పొట్ట చేత్తో పట్టుకుని జీవనోపాధి వెతుక్కుంటూనో, పిల్లల చదువులు సిటీలో సాగితే వాళ్ళ బ్రతుకులు బావుంటాయన్న ఆశతోనో నగరానికి వచ్చినవారే.

ఆటోలు, కూలీ పనులు, మాల్స్, హాస్పటల్స్ లాంటి చోట పనిచేసే మగవారి పనులకి అదనంగా కొందరాడవారు చుట్టుపక్కల ఇళ్ళల్లో పని చేస్తూ ఉంటారు.

ఆ స్థలం అతని తండిదో, తాతదో అసలామాటకొస్తే కొన్నారో లేదో కూడా తెలీదు. మధ్యలో కట్టించిన పెద్ద నీళ్ల టాంకు, ఓపికుండి కొట్టుకునేవాళ్ళకోసం బోరింగ్ పంపులు ఉంటాయి.

వాటికి ఒక పక్కగా నాలుగైదు బండలు వేసి ఉంటాయి బట్టలుతుక్కోవడానికి.

ఓ మూలగా బాత్రూములు..

శంకర్ చిన్నప్పుడు అక్కడే ఒక చిన్న పెంకుటిల్లు ఒక పక్కగా ఉండేది, ఆ పెద్ద స్థలానికి కాపలా దారుకు ఇల్లుంటే ఎలా ఉంటుందో అలాగే. ఒద్దికగా. ఓ మూలగా రెండు గదులు, ఒక వంట గది.. వెనకవైపు కిందకి దిగిన చూరు..

శంకర్ హయాం లో దాంట్లో రెండు బోర్ లు తవ్వి టాంకర్ వ్యాపారం మొదలుపెట్టి బాగా సంపాదించాడు.

స్వతహాగానే మొండివాడు, కోపిష్టి, జులుం చలాయించే తత్వం కావడంతో స్నేహితులు నలుగురూ 'శంకరన్నా' అంటూ ఓ దాదాగిరీ ని కట్టబెట్టారు. పని దగ్గర నిక్కచ్చి, కనికరం లేనట్టుగా ఉంటాడు. ఇష్టమైన విషయాల్లో మినహాయింపు దానికి.

నీళ్ళ వ్యాపారం సాగినన్నాళ్ళు సాగాకా, చుట్టుపక్కల చాలా ఇళ్ళు, అపార్ట్మెంట్ లు వచ్చేశాకా నెమ్మదిగా నీళ్ళ వ్యాపారం మానేసి చిన్నగా రియల్ ఎస్టేట్ లో కి దిగాడు. అలా మిగిల్చిన డబ్బులోనే ఈ కాంపౌండ్ కట్టి చిన్న చిన్న వాటాలున్న ఇళ్ళన్నీ అద్దెకిచ్చాడు. ఆ స్థలాన్ని ఇప్పటివరకూ ఎవరూ ఏమీ చేయలేదన్నా, అక్కడున్న వారిని కదిలించలేదన్నా దానికి శంకర్ పరపతే కారణం. చుట్టుపక్కల బిల్డింగుల్లో సగం అతను కట్టిం చినవే కావడమూ కారణమే.

"ఒకటో తారీఖు కదా.. అటు సూర్యుడిటుపొడిచినా శంకర్ రావడం మాత్రం తప్పదు" అన్నాడు రామస్వామి నోట్లో పెట్టుకున్న బీడి ముట్టిస్తూ..

ఏదో పెద్ద జోక్ విన్నట్టు నవ్వాడు అతని పక్కన కూర్చున మునిరాజు..

" అంత నవ్వెందుకొస్తోం దో పెద్దాయనకి? అద్దె తీసి నా చేతిలో పెట్టండి" అన్నాడు శంకర్

ఆ మాటలకి మునుస్వామి కొద్దిగా ఇబ్బంది పడ్డాడు..

" ఏమయింది?" సూటిగా పలికిన ఇందాకటి గొంతు కటువుగా మారుతూ అంది..

" అది, శంకర్ బాబూ" అంటూ ఏదో చెప్పబోతున మునిరాజు వైపు చిరాగ్గా చూస్తూ " ఇంట్లో ఏముంది ఇవ్వడానికి?" అన్నాడు మరింత కటువుగా..

" అదేంటి బాబూ?"

" నీకు తెలీదా? పైసా చేతిలో పడకపోతే మనిషిని కాదని. డబ్బు లేకపోతే ఇవ్వడానికేముంది?" అన్నాడు..

" మా ఇంటిదానికి ఒంట్లో బాగోక చేతిలో డబ్బు ఖర్చయిపోయింది. ఒక్క నాలుగురోజులాగితే" అన్నాడు మునిరాజు

"సరే! నాలుగు రోజులు ఇల్లు తాళం పెట్టేస్తాను, ఆపైన డబ్బిచ్చి వద్దురుగాని. అందరికీ ఆటయిపోయింది.." అన్నాడు చిరాగ్గా.

" అదేంటయ్యా, ఎన్నేళ్ళబట్టి ఉంటన్నాడు, ఎగ్గొట్టే రకం కాదు కదా?" రామస్వామి ఏదో చెప్పబోతుంటే..

" నీకు సంబంధించని విషయాల్లో ఏలెట్టకు ముసలాయనా? డబ్బు దగ్గిర నాటకాలడద్దు. నాకు మా చెడ్డ చిరాకు..నెల తిరిగేసరికి అద్దివ్వాలన్న సంగతి తెలీదా? నడు మునిరాజు.. ఏం చెయ్యమంటావో చెప్పు"అన్నాడు ఖచ్చితంగా..

ఏం చెయ్యాలో తెలీలేదు మునిరాజుకి. శంకర్ సంగతి తెలియని వాడు కాదు..

తప్పని అవసరానికి తప్పక పెట్టిన ఖర్చు..

ఇంట్లోకి వెళ్ళి పాత వెండి గ్లాస్ తెచ్చి శంకర్ చేతికి ఇచ్చాడు..

" నాలుగు రోజులయ్యాకా డబ్బు సర్దుబాటయ్యాకా ఇచ్చి తెచ్చుకుంటాలే, ఇది తప్ప ఇంట్లో మరేటీ లేదూ అన్నాడు.

నిర్లక్ష్యంగా చూశాడు శంకర్..

గట్టిగా దిట్టంగా ఉంది గ్లాస్. “సరే కానీ,నాలుగు రోజుల్లో ఇవ్వకపోతే గ్లాస్ ని మర్చిపో” అంటూ పక్కనున్న అనుచరుడికిచ్చాడు.

మునిరాజు మాట్లాడలేదు, లోపలనించి పార్వతమ్మ దగ్గు వినిపిస్తోంది. భారంగా నిట్టూర్చాడు మునిరాజు.

" ప్రతీ నెలా నువ్వెందుకన్నా రావడం! నేను తీసుకొచ్చేస్తాగా?" అంటాడు అనుచరుడు దాసు.. అయిన శంకర్ ఎందుకో వస్తూనే ఉంటాడు...

వచ్చి మధ్యలో టాంకు దగ్గర నిలబడతాడు.

అతడొస్తాడన్న సంగతి తెలిసిన వారు, వచ్చిన సంగతి తెలుసుకున్న వాళ్ళు వెంటనే వచ్చి ఇవ్వాల్సినవి చేతిలో పెట్టేస్తారు.

' అద్దె పెంచినా, నీళ్ళు తగ్గించినా మాట్లాడకూడదు. పెయింట్లూ అవి వేయించమని అడక్కూడదు.. ఏ రిపేర్లొచ్చినా వాళ్ళే చేయించుకోవాలి. ఏదైనా అంటే ఈ మహానగరంలో ఇల్లు దొరకడమంటే మాటలా? ఓ సారి బయటకెళ్ళిచూసి రండి, తెలుస్తుంది" అంటాడు.

మరో మాటకి తావుండదు.. కానీ అతనన్నమాట నిజమే కావడాన గతిలేక ఊరుకుంటారు

‘ఇంత రాతి మనిషేమిటో ?’అనుకుంటారు

పధ్నాలుగు వాటాల వారినీ బెదిరించి బెల్లించి ముక్కు పిండి వసూలు చేస్తాడు..

“నాకిదే పననుకున్నారా? టైము లేదు తెమలండి” అంటూ..

ఈ సారీ అలాగే అయ్యింది. అందరూ ఇచ్చిన డబ్బులు దాసు చేతికిచ్చి అతను లెక్కపెట్టి సరిపోయిందన్నాకా మూలగా ఉన్న తమ పాత ఇంటి దగ్గరకి చేరాడు ఎప్పట్లాగే..

" ఏరా బామ్మర్దీ,! ఎలా గుంది చదువు? పాసవుతున్నావా? లేదా మనలెక్కేనా?' నవ్వుతూ అడిగాడు..

" ఫస్ట్ క్లాస్ మార్కులొచ్చాయన్నా? నీ దయ ఉండాలే కానీ, పాసవ్వడమూ ఓ గొప్ప విషయమేనా?" అన్నాడు శేషు బాబనే కుర్రాడు.. అతనికి 21-22 ఉంటాయి. ఇంజనీరింగ్ చదువుకుంటునాడు.. తల్లితో పాటు ఉంటాడు..

" ఇదిగో బాబూ అద్దే!" అంటూ వచ్చింది దుర్గమ్మ, శేషు బాబు తల్లి..

" వద్దులే అత్తమ్మా, ఉంచు.. వీడికి ఉద్యోగం వచ్చాకా తీసుకుంటాలే అంతా ఒకేసారి.”

“వస్తారా, బాగా చదువుకో, మంచి ఉద్యోగం వస్తే చక్కటి పిల్లొస్తుంది” అంటూ శేషుబాబు తల మీద తట్టి దుర్గమ్మ కి చెప్పి వెళ్ళిపోయాడు..

వాన వెలిసినప్పటి ప్రశాంతత..

" అమ్మయ్యా, మళ్ళీ నెలవరకూ రాడు" అంది పరమేశ్వరి..

ఒకసారి అద్దె ఇవ్వలేని పరిస్థితి వచ్చినప్పుడు అతనన్న మాటలనామె ఎప్పటికీ మర్చిపోలేదు. నలుగురున్న తమ కుటుంబానికి సరిపడే ఇల్లు వెతికి వెళ్ళేంత తాహతు లేదు, అందుకే ఆ అవమానాన్ని దిగమింగి పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతోందా టీచర్.

" ఎంతమందినైనా చూసాను కానీ ఇలాంటి కరోడా మనిషిని చూడలేదు పెద్దమ్మా!" అంది పరమేశ్వరి దుర్గమ్మతో..

" ఎవరి గురించమ్మా నువ్వనేది?' అంది దుర్గమ్మ నెమ్మదిగా..

" మీరొచ్చింది ఈ మధ్యనేగా, ముందు ముందు తెలుస్తుంది లే" అంది పరమేశ్వరి..

" శంకరం బాబు గురించా? దేవుడు కదూ!" అంది దుర్గమ్మ..

" దేవుడా? ఇంకా నయం!" అంటున్న పరమేశ్వరిని ఆపి..

" అవునమ్మా, ఏ నెలకానెలే అద్దె ఇద్దామంటే ' వద్దు అత్తమ్మా, ఉండనీలే, శేషుబాబుకుద్యోగం వచ్చాకా తీసుకుంటానంటాడు. పైగా ఇంట్లో దీపాలు సరిగా వెలుగుతున్నాయా? ఏమైనా కావాలా?అని మరీ మరీ అడుగుతాడు " అంది దుర్గమ్మ.

ఆ మాటలు పరమేశ్వరితో పాటు మరో నాలుగిళ్ళ వాళ్ళు వినవే విన్నారు..

పధ్నాలుగిళ్ళల్లో గుప్పుమంది మరుక్షణంలో...

'శంకరేనా?' విస్మయం అనిపించింది.. లేని నమ్మకం ఆ మా టని బలపర్చింది..

" ఎలా సాధ్యం? పదేళ్ళబట్టి ఉంటన్నాను ఇక్కడే. ఏనాడూ వినలేదు... ఏదైనా కావాలంటే కస్సుమనడమే కానీ ఇదెలా?" చెప్పాడు ఆనందరావు.

ఎవరికి తోచినవి వారు అనుకున్నారు. తోచని వారు విని ఊరుకున్నారు..

దుర్గమ్మకి అబద్ధం చెప్పవలసిన అవసరం లేదు.. అది నిజమని నమ్మాలనిపించడం లేదు..

"నిజమే?" ఆశ్చర్యపోయారు ఆడవారు..

" అవునొరే ఇన్నేళ్ళబట్టి చూస్తన్నాను ఆ వాటానెప్పుడూ చదూకునే కుఱ్రాళ్ళకే ఇస్తాడు, మన శేషుబాబు ఇంకా స్పెషలేమో మరి, పైసా అద్దె వద్దంటున్నాడంట మరి, ఏటో కత?. అన్నాడు రామస్వామి...

" ఏటో అంతా మిస్టరీగా ఉంది.. పోనీలే అత్తమ్మా, మీ అదృష్టం..బాగా చదువుకుని శంకర్ సెప్పినట్టుద్యోగం సూసుకో, మీ అమ్మ కష్టాలు తీరిపోతాయి" అంది శారద నవ్వుతూ...

-------------------

' దాసూ, చదువవగానే శేషుబాబుకో మంచి ఉద్యోగం చూడాల్రా మనం" అన్నాడు కారెక్కుతూ అనుచరుడు దాసుతో..

" అలాగే సూద్దాంలే అన్నా, ఏటి ఆ బాబుకంత పెషల్.. అసలా మాటకొస్తే స్టూడెంట్ కుఱ్రాళ్ళ పెషల్ ఏంటీ?" అన్నాడు దాసు నవ్వుతూ..

శంకర్ నవ్వలేదు..

అప్పటికే కళ్ళు మూసుకుని సీటు మీద కి తల వాల్చుకుని ఉన్నాడు..

దాసు డ్రైవర్ కి సైగ చెయ్యగానే కార్ బయల్దేరింది..

---------------------------------------------

కుమారి..

పచ్చపూల తెల్లని పరికిణీ, పసుపు వోణీ, పచ్చ జాకెట్ వేసుకుని కనిపించింది శంకర్ కి మొదటిసారి..

అప్పటి ఆ పిల్ల రూపం శంకర్ కళ్ళల్లో నిత్యనూతనం...

" ఎవరు?" అడిగాడు అప్పటికింకా దాదా కాని శంకర్..

" నా పేరు కుమారి.. మాకు ఇల్లద్దెక్కావాలి, మీ పక్కనున్నాయంటేనూ" అందా అమ్మాయి..

మాటి మాటికి రెప్పలార్పుతున్న ఆ కళ్ళు చేపపిల్లల్లా కదులుతున్నాయి..

" నీ పేరు?"

" కుమారి, మీనాకుమారి" అయినా నాపేరెందుకు? అందామె గడుసుగా..

" ఇల్లెవరిక్కావాలో తెలీద్దా?" నవ్వాడు..

" అదా!' తనూ నవ్వింది, అంటే ఉందన్నమాటేగా!" అంటూ తూనిగలా వీధివైపుకు పరిగెత్తి వాళ్ళ నాన్నని వెంటబెట్టుకుని వచ్చింది.

" నా పేరు రాములు బాబూ, నేనూ, మా కుమారి, మా చిన్నోడు సతీష్ మాత్రమే ఉండేది, ఇల్లేది బాబూ, చూడొచ్చా?" అడుగుతున్నాడాయన..

"నాన్నా!" అని పిలిచినవాడే మళ్ళీ ఆగి..

" రండి చూపిస్తా" అంటూ కదిలాడు.

వెనకే కుమారి వాళ్ళు..

" ఇల్లు పాతదిలాగుంది" అంది కుమారి..

" పాతదైనా అన్నీ ఉన్నాయి, పక్కనే మేముంటున్న ఇల్లు కట్టకముందు మేమిక్కడే ఉండేవాళ్ళం" అన్నాడు శంకర్..

పాతిక రూపాయలు తక్కువ అద్దెకిచ్చినందుకు తండ్రితో తిట్లు తిన్నాడు.. ఆనాటినించీ ఎవరికీ తగ్గించలేదు

పొద్దున్నే రాములు పనికి, సతీష్ స్కూల్ కి వెళ్ళిపోయేవారు.

పొద్దంతా కుమారొక్కత్తే ఇంట్లో ఉండేది.. వంట చేస్తూ, దొడ్లో అంట్లు కడుగుతూ కూనిరాగాలు తీస్తూ ఉండేది..

అవి వింటూ తనకోసమే పాడుతున్నట్టుగా అనుకుని సంబరపడిపోయేవాడు.

తీరైన ఉద్యోగం లేక ఎక్కువసేపు ఇంట్లోనే ఉండే శంకర్ కి కుమారి ని చూడ్డమే పని, ఆమె అంటే విపరీతమైన ప్రేమ.

ఆమె కూడా ఎప్పుడూ తెల్లని పళ్ళన్నీ కనిపించేలా నవ్వుతూ అతని పట్ల సుముఖంగా ఉన్నట్టే కనిపించేది.

ఏదో వంకని ఇంటికొచ్చే అతనికి వచ్చినప్పుడల్లా కాఫీయో, బజ్జీలో పెట్టి మర్యాద చేసేది..

కుమారి కంటే ఎక్కువగా సతీష్ శంకర్ వెనకే తిరిగేవాడు. 'అన్నా' అంటే 'బావా అనరా బాగుంటది ' అన్న అతని మనసుని మొదటగా తెలుసుకున్నవాడు సతీష్.

ఎందుకో తెలీదు కానీ శంకరంటే సతీష్ కి పంచ ప్రాణాలు.

చదువుకోవడం అయిపోయాకా శంకర్ ఇంట్లోనే కేరం బోర్డు ఆడడం, కలిసి టీ వీ చూడ్డం ఇలా అక్కడే ఎక్కువ కాలం గడిపేవాడు.

" ఏం పెట్టి తోముకుంటుందో, ఆ పిల్ల ఒళ్ళెంత నిగనిగలాడిపోతుందో!"

" ఆకళ్ళని బట్టే మీనాకుమారని పెట్టారేమో పేరు" అనుకున్నాడు మొదట్లో

" అసలిక్కడ పుట్టాల్సిన పిల్లకాదు, కానీ నాకోసమనే ఇక్కడ పుట్టింది" అనుకున్నాడు సరిగ్గా నెల తర్వాత..

" ఇదిగో, నాకూ నాంచడాలు, ముంచడాలు సేత కాదు, మనదంతా డైరెక్ట్.. నువ్వంటే నాకు ప్రాణం.. నిన్నే పెళ్ళాడతా" అన్నాడు చిరునవ్వుతో ఓ రోజు కుమారి దగ్గరకెళ్ళిపోయి..

" సినిమా పేరు నాకు తెలుసు, చాలా బాగుంటదా సినిమా, అయితే ఏంటి? " అంది కుమారి నవ్వుతూ..

" అదేంటి? " అన్నాడు అర్థం కానట్టు..

" కాక, నేను నిన్ను పెళ్ళాడడమా? అద్దంలో ముఖమెప్పుడన్నా చూసుకున్నావా " అంది కుమారి నవ్వుతూనే..

" ఏం బావకేం తక్కువ? ఎంత మంచివాడు!" ఎక్కడనించి వచ్చాడో సతీష్ అన్నాడు..

" సాల్లే, నొర్ముయ్, బావంట బావ!" అంది కుమారి..

శంకర్ దగ్గరగా వచ్చి చెయ్యి పట్టుకున్నాడు సతీష్. వాడిని దగ్గరకు తీసుకున్నాడు..

" అదలాగే అంటుందిలే బావా, నాన్నకి నేను చెప్తాను కదా!" అన్నాడు పెద్దవాడిలా..

నవ్వాడు శంకర్..

" వద్దులేరా, దానికిష్టం లేకపోతే ఎందుకు?" అన్నాడు ఈ సారి నవ్వలేదు..

" దాని ముఖం, ఎర్రగా బుర్రగా ఉంటానని దానికి గొప్ప, నాన్న చెప్తే చచ్చినట్టు ఒప్పుకుంటుంది, నీకెందుకు? నాకొదిలెయ్యమన్నానుగా ఆ సంగతి!" అన్నాడు..

పసితనం పూర్తిగా వదలని పదిహేడేళ్ళ వాడి ముఖాన్ని చూస్తూ..

" చూద్దాం లేరా, ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతూ నాతో చక్కగా ఉండేసరికి నాలాగే దానికీ నేనంటే ఇష్టమే అనుకున్నాను, నాదే తప్పు" అంటూ వెళ్ళిపోయాడు శంకర్..

ఆ రోజు రాత్రి వాళ్ళింట్లో చాలా సేపటిదాకా లైట్ వెలిగి ఉండడమూ, ఎప్పుడూ లేనిది గొంతులు పెంచి మాట్లాడుకోవడమూ నలుగిరితో పాటు శంకర్ కీ వినిపించింది..

ఏమయిందో తెలియలేదు కొన్నాళ్ళు..

తండ్రీ, తమ్ముడూ కూడా ఎంతో నచ్చ చెప్పారని, కానీ కుమారి ఉద్యోగమైనా లేదు, రౌడీలా తి రిగే శంకర్ ని చేసుకోనని, తెగేసి చెప్పిందనీ చెప్పిందని ఆ తర్వాత తెలిసింది అతనికి..

ఇంటర్మీడియెట్ పరిక్షలు రాసి ఇంజనీరింగ్ లో చేరాడు సతీష్..

కాలేజీ దూరం కావడాన పొద్దున్నే వెళ్ళిపోయేవాడు,వచ్చేటప్పటికి పొద్దుపోయేది, ఇదివరకులా శంకర్ దగ్గరకి రావడానికి కుదరటం లేదు..

పెళ్ళి ప్రస్తావన తెచ్చినప్పటినించీ కుమారి శంకర్ ని తప్పించుకుని తిరుగుతోంది, రాములు కూడా ఎటూ చెప్పలేక ముఖం చాటు వేస్తున్నాడు.

స్నేహితులతో కలిసి పిక్నిక్ కి వెళ్ళిన సతీష్ వాళ్ళు వెళ్ళిన వాన్ హైవే మీద డివైడర్ కి గుద్దుకుని జరిగిన యాక్సిడెంట్ లో అక్కడికక్కడే పోయాడు.

ఏ క్షణాన కలిశాడో ఆ చిన్నవాడు తనకెంతో ప్రాణమయి పోయాడు.. అలాంటివాడు ఇక లేడన్న వార్త తట్టుకోలేకపోయాడు శంకర్..

ఆ బాధ మర్చిపోవడానికో, శంకర్ ఎదుట ఎక్కువ కాలం ఉండలేకో ఓ రాత్రి కుమారి, వాళ్ళ నాన్న ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. ఎక్కడికెళ్ళారో తెలీదు, ఎవరితోనూ ఒక్క మాట కూడా చెప్పలేదు. శంకర్ కివ్వాల్సిన అద్దె డబ్బులు కవర్లో పెట్టి పక్కింటి వారికిచ్చి వెళ్ళిపోయారుట..

సతీష్ ని, కుమారిని మర్చిపోలేని శంకర్ ఒంటరిగానే ఉండిపోయాడు చాలా రోజులు..

ఆ వాటా వైపు ఎప్పుడు చూసిన అలల్లో చేపల్లాంటి కుమారి కళ్ళు, ఆమె నవ్వు గుర్తొచ్చేవి.. సతీష్ అమాయకమైన ముఖం వెంటాడేది...

" బావా! అన్న వాడి పిలుపు ఆ గదుల్లో నాలుగు మూలలా వినిపించేది"

" అక్కనొప్పిస్తాను, నీకెందుకు?" అన్నాడు..

ఇప్పుడు చూద్దామన్నా లేడు..

శంకర్ మనసు మెలితిరిగే క్షణాలు అక్కడే..

ఆ బాధలోంచే వచ్చిందేమో తెచ్చిపెట్టుకున్నదిగా మొదటా, సహజలక్షణం లా కనిపించేలా ఆ పిమ్మటా..

కరకుదనం, కోపం..

నెమ్మదిగా వ్యాపారాలు, వ్యవహారాల్లో పడిపోయాడు. ‘ చిన్నదా, పెద్దదా? అని కాదు, వ్యాపారం చేస్తున్నామంటే ఖచ్చితంగా ఉండాలి, లేదంటే నెత్తికెక్కేస్తారు’ తండ్రి చెప్పిన మాటలే తూ, చ తప్పకుండా పాటించేవి..

ఇదివరకంత తరచుగా కాకపోయినా సతీష్ కుమారీ గుర్తొస్తూనే ఉంటారు తరచూ..

సతీష్ గుర్తుగానే చదువుకునే కుర్రాళ్ళున్నవాళ్ళకే ఆ వాటా ఇచ్చేవాడు శేషు కనబడేవరకూ..

" ఇల్లు కావాలండీ" ఇంటర్మీడియెట్ లో ఉన్న శేషుబాబు అడిగినప్పుడు ఉలిక్కి పడ్డాడు శంకర్..

శేషులో కనిపిస్తున్న సతీష్ పోలికలు..

అన్నదమ్ములంటే నమ్మేసేలా..

వాడికి కళ్ళజోడు లేదు, వీడికుంది.. గట్టిగా చూస్తే అదే తేడా..

అలా శేషు బాబు, దుర్గమ్మా వచ్చి చేరారు.. బామ్మర్దీ, అత్తమ్మా అయ్యారు..

" అత్తమ్మా అంటావు చక్కగా, నాకో కూతురున్నా బాగుండు" అని దుర్గమ్మ అంటే

" ఆ మాటొద్దులే అత్తమ్మా!" అంటాడు.. శంకర్...

Click here to share your comments on this story